క్లుప్తంగా

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కామారెడ్డి అర్బన్: ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా 4వ మహాసభ శుక్రవారం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఆశాలకు నెలకు రూ.18వేలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పిందని ఆరోపించారు. రూ. 50లక్షల ప్రమాద బీమా అమలు చేస్తామన్న కేంద్రం ఇప్పటికి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. వేతనం లేని ఆశాలకు నెలకు రూ.9,900 సాధించిన ఘనత సీఐటీయూ పోరాటాలే కారణమని సిఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిరా, నాయకులు రాజనర్సు, అరుణ్‌కుమార్, వీరయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు



కామారెడ్డి అర్బన్: బీసీ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు గవర్నర్ ఆమోదం పొందకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని అన్నారు. బీసీలు రిజర్వేషన్ల కోసం ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌గౌడ్, మోతీరాంనాయక్, కొత్త నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ పెరుగుతుంది



కామారెడ్డి రూరల్: ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ పెరుగుతుందని నిజామాబాద్ 12 బెటాలియన్‌కు చెందిన హవల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసిన ఎన్‌సీసీ కెడెట్లకు ఏ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌కుమార్, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేకుల దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డి అర్బన్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీసీ వ్యతిరేకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. బీసీ సంక్షేమ సంఘం, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, నీల నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుంబాల లక్ష్మణ్‌యాదవ్, ప్రతినిధులు జి.యాదగిరి, మోహనాచారి, నారాయణరావు, రమేశ్, వెంకట్, నాగభూషణం, నర్సయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి



కామారెడ్డి అర్బన్: విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని, మానసికంగా ఆరోగ్యంగా, దృడంగా ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి నాగరాణి, జిల్లా మానసిక వైద్యాధికారి రమణ అన్నారు. శుక్రవారం స్థానిక సాందీపని జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిరోధం, మానసిక ఆరోగ్య సంరక్షణకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఐదేళ్లుగా మానసిక ఆరోగ్యంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైకియాట్రిక్ సోషల్ వర్కర్ రాహుల్, హెల్త్ ఎడ్యుకేటర్ సిద్ధార్థ్, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, సాందీపని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, అకడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?

- బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లో అధ్వానంగా మారిన రహదారులు
- గుంతలతో గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, గ్రామస్తులు



గుంతలమయంగా మారిన మిర్జాపూర్-వీరాపూర్ రోడ్డు



బీర్కూర్-మిర్జాపూర్ రోడ్డు దుస్థితి

బాన్సువాడ: గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. అడుగుతీసి అడుగువేయలేని స్థితికి చేరాయి. రోడ్లు గుంతలుగా మారడంతో గ్రామాల్లోకి ఆర్టీసీ బస్సులు రాని పరిస్థితి నెలకొంది. బాన్సువాడ ప్రాంతంలో ప్రధాన రహదారులు బాగానే ఉన్నా గ్రామాల్లోకి వెళ్లే రోడ్లు ఇబ్బందికరంగా మారాయి. బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులతో నిత్యం ఏదో ఓ చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల వేళ గ్రామాల్లోకి వచ్చే రాజకీయ నాయకులకు రోడ్ల పరిస్థితి ఓ సవాలుగా మారింది. బీర్కూర్ మండలంలో బీర్కూర్-మిర్జాపూర్ రోడ్డురెండు కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డుకు గుండా సుమారు 90 వరకు గుంతలు ఉన్నాయి. ఈ దారిలో విద్యార్థులు, వాహనదారులు బీర్కూర్‌కు, బాన్సువాడకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా మారడంతో బస్సు సౌకర్యం లేదు. మిర్జాపూర్-దుర్కి రోడ్డు, మిర్జాపూర్-రైతునగర్, బరంగెడ్గి రోడ్డు, బైరాపూర్, మల్లాపూర్ రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో నిత్యం మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

బాన్సువాడ మండలంలోని బుడ్మి-కొత్తాబాద్, మొండిసడక్-కోనాపూర్, కోనాపూర్-కాద్లాపూర్, కాద్లాపూర్-హన్మాజీపేట్, కోనాపూర్-సంగోజీపేట్ రహదారులు అధ్వానంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లాలంటే నిత్యం గండంలా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బొల్లారం హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు శుక్రవారం డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి మండలాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 13, 16వ తేదీల్లో నిర్వహించే క్రీడాపోటీలలో వీరు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు సుకుమార్‌గౌడ్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో ఆడేందుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. తాడ్వాయి, లింగం పేట్, రాజంపేట్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

వాటర్ ట్యాంక్‌ను కూల్చివేయాలి



బాన్సువాడ: పట్టణంలోని సంగమేశ్వర చౌరస్తా వద్దలో శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకును వెంటనే కూల్చివేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు శుక్రవారం ట్యాంకు వద్ద నిరసన తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. చౌరస్తా వద్ద ట్యాంకు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. ట్యాంకును కూల్చివేయాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. నాయకులు ఉమేశ్, చీకట్ల రాజు, సాయికిరణ్, హన్మాండ్లు యాదవ్, ప్రసాద్, నాగరాజు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో పోషకాహార వారోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు ఐసీడీఎస్ నిజాంసాగర్ క్లస్టర్ అధ్యక్షురాలు రోజ శుక్రవారం అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, నాగమణి, స్వరూప, రమాదేవి, జీపీ కార్యదర్శి తుకారాం, ఆరోగ్య కార్యకర్త సునీత, ఆశావర్కర్లు నాగమణి, కమల పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- జూనియర్ సివిల్ జడ్జి వినీల్ కుమార్



మాట్లాడుతున్న జడ్జి వినీల్ కుమార్

బిచ్కుంద(జుక్కల్): ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకొని మంచి జీవనశైలి అలవర్చుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని బిచ్కుంద జూనియర్ సివిల్ జడ్జి వినీల్ కుమార్ అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. జంక్‌ఫుడ్, మద్యం, ధుమాపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కోర్టుకు వచ్చిన కక్షిదారులు న్యాయసేవా అధికార సంస్థ ద్వారా సహాయం పొందవచ్చని, మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారికి న్యాయసేవ కౌన్సిలింగ్ కూడా అందుతుందని అన్నారు. అనంతరం డాక్టర్ స్వప్నాలి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ నాయకులు, న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, మల్లేశ్వర్, ప్రకాశ్, విఠల్, శివాజీ, మహ్మద్ పాల్గొన్నారు.

సామాన్యుడి ధైర్యం.. సమాచార హక్కు చట్టం



ఎల్లారెడ్డిరూరల్: సమాచార హక్కు చట్టం సామాన్యుడికి కొండంత ధైర్యమని సమాచార హక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ శ్రీనివాసరావు కేక్ కట్ చేసి డైరెక్టర్ సలీంకు తినిపించారు. కార్యక్రమంలో సీఏ రాజారెడ్డి, సమాచారహక్కు చట్టం ప్రతినిధులు ఇంతియాజ్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్ సర్కార్ అన్నింటా విఫలం'



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రేవంత్‌రెడ్డి సర్కార్ అన్నింటా విఫలమవుతుందని నాగిరెడ్డిపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమిభయంతోనే కోర్టులో స్టే వచ్చేలా చేశారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌పై కోర్టు స్టే విధిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందే తెలుసని, ఈ క్రమంలోనే కాంగ్రెస్ అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయలేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య, ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీచైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి మంగలి యాదగిరితో, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారిని కలిసిన నాయకులు

కామారెడ్డి అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మధుమోహన్‌ను టీఎన్జీవోస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి ముల్కరాజు, ప్రతినిధులు చక్రధర్, దేవరాజు, శివకుమార్, లక్ష్మణ్, రాజేశ్వర్, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

జీపీవో మండల నూతన కార్యవర్గం ఎన్నిక

బీబీపేట: మండల గ్రామ పాలన అధికారుల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుక లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా ఎం. హరి, ప్రధాన కార్యదర్శిగా ఏనుగు రవి, కోశాధికారిగా జెనిగే సాయిలు, సలహాదారుగా కల్లు లక్ష్మణ్, సభ్యులుగా భూపాల్, భిక్షపతి, రమేశ్, స్వామి ఎన్నికయ్యారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

నిజాంసాగర్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ లబ్ధిదారులకు సూచించారు. జుక్కల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్న లబ్ధిదారులకు విడతల వారిగా బిల్లులు బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి సుధాకర్ తదిరులు ఉన్నారు.

బండారెంజల్‌లో పంటల పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని బండారెంజల్‌లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్ వరి పంటను పరిశీలించారు. వరిలో మానిపండు తెగులు, సుడిదోమ ఉందని వీటి నివారణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో అమర్ ప్రసాద్

రైతుల సంక్షేమం కోసం పాటుపడాలి



భిక్కనూరు: రైతుల సంక్షేమం కోసం రెడ్డి సంక్షేమ సంఘం పాటుపడాలని గుడాడిరెడ్డి సంఘం ప్రతినిధి ద్యావర సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కుంట లింగారెడ్డిని సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ ఎన్గు వెంకట్‌రెడ్డి, సంఘం సభ్యులు వంగేటి సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పైడి నరేందర్‌రెడ్డి, బాపురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



పిట్లం(జుక్కల్): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సృజన్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోమటి చెరువు తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవ్‌రావు, ఉప సర్పంచ్ చందు రాథోడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్రోత్ రవీందర్ నాయక్, సవాయిసింగ్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండుగ



బోర్లంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు



గాంధారి మండలం గౌరారంలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంలో గ్రామ దేవతల పండుగను గ్రామ కులసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామ దేవతల పండుగ నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్ రెడ్డి, హన్మాంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మమ్మాయి కాశీరాం, సతీశ్‌గౌడ్, మంద శ్రీనివాస్, సత్యం, టేకుల మొగులయ్య, మన్నె సాయిలు, చాకలి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని గౌరారంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏడాది వానాకాలం పంటలు కోతకు వచ్చేసమయంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తామని అన్నారు. గ్రామస్తులు బోనాలను గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నస్రుల్లాబాద్‌లో గ్రామ దేవతల పునఃప్రతిష్ఠాపన

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం గ్రామ దేవతల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు చేపట్టారు. దేవతల విగ్రహాలను గ్రామస్తులు ప్రధానవీధుల గుండా ఊరేగించారు.

అనంతరం పెద్ద పోచమ్మ ఆలయం వద్ద యజ్ఞం చేశారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అరిగె సాయిలు, అయినాల లింగం, కూని సాయాగౌడ్ స్వామి, నారాయణ, లింగం, అల్లం గంగారాం తదితరులు పాల్గొన్నారు.



గ్రామ దేవతల విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఎరువుల దుకాణం తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని శుక్రవారం మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణంలో నిలువ ఉన్న ఎరువులు, పురుగుల మందుల వివరాలను సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుల మందులకు రసీదులు ఇవ్వాలని దుకాణ నిర్వాహకుడికి సూచించారు. ఆయన వెంట ఏఈవోలు, సిబ్బంది ఉన్నారు.

తాడ్వాయిలో బంద్ ప్రశాంతం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో బంద్‌ను ప్రశాంతంగా నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇవ్వడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిల పక్షం నాయకులు మండల కేంద్రంలోను దుకాణాలు, హోటళ్లను మూసివేయించారు. అనంతరం బీసీ రిజర్వేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న కపట ప్రేమకు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ఎల్లారెడ్డి: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో గవాయ్‌పై దాడికి నిరసనగా ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సామెల్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్తం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ పి.మనోరంజన్ శుక్రవారం పేర్కొన్నారు. పట్టణంలోని గోదాంరోడ్డు, పాత బస్టాండ్ వెనుక ప్రాంతం, కుమ్మరిగల్లి, బతుకమ్మ కుంట ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోపన్‌పల్లి, హజ్గుల్, మిషన్ కల్లాలి, సిర్‌సముందర్, దౌల్తాపూర్, దేవాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

యువత మద్యానికి దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డిరూరల్: యువత మత్తుపదార్థాలతో పాటు, సామాజిక మాధ్యమాలకు బానిసలు కావద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు శంకరయ్య, చంద్రకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరీక్షలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీస్ట్ అరుణ్ కుమార్ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఐఈఆర్‌టీలు చిన్నసాయిలు, సునీల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థుల కోసం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవిసింగ్, వైద్యురాలు సారిక, ఐఈఆర్‌పీ కమల్ కిశోర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపేట్‌లో పోలీస్ కళాజాత

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్‌లో గురువారం రాత్రి పోలీస్ కళాబృందం సభ్యులు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజేందర్, తిరుపతి, శేషారావు, ప్రభాకర్, సాయిలు, బాలకృష్ణ, పవన్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.